

పత్తి కొనుగోలుకు..

రైతుల సౌకర్యార్థం పత్తి కొనుగోలు కేంద్రాలను అధికారులు జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేశారు. 8లో▸



మెరుగుపర్చుకోవాలి

సాంకేతిక విద్యను మెరుగుపర్చుకోవాలని డీఆర్‌డీఎల్ హైదరాబాద్ సైంటిస్ట్ డాక్టర్ విజయ్‌కుమార్ అగర్వాల్ అన్నారు. 8లో▸



సమస్యల పరిష్కారానికి కృషి

ప్రభుత్వ ఆస్పత్రిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఆర్డీఓ సరిత అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దు



చింతపట్లలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఆర్‌డీఓ శ్రీలత

యాచారం: రైతులు దళారులకు ధాన్యాన్ని విక్రయించి మోసపోవద్దని డీఆర్‌డీఓ శ్రీలత సూచించారు. మండల పరిధిలోని చింతపట్ల, నందివవనపర్తి గ్రామాల్లో తెలంగాణ గ్రామీణాభివృద్ధి సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆరుగాలం పండించిన పంటను నాణ్యమైన మద్దతు ధర, సకాలంలో డబ్బులు అందే ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సేకరించే క్వింటాల్ ధాన్యం గ్రేడ్ ఎ రకానికి రూ.2,320, సాధారణ రకానికి రూ. 2,300గా నిర్ణయించినట్లు తెలిపారు. నింబంధనల ప్రకారం రైతులు నాణ్యత ప్రమాణాలతో కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తెచ్చి విక్రయించాలని కోరారు. కార్యక్రమంలో సెర్ప్ డీపీఎం నర్సింహ, యాచారం ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి రవినాథ్, ఏపీఎం సుదర్శన్‌రెడ్డి, సీసీ నర్సింహ పాల్గొన్నారు.

రింగ్ రైల్ నిర్మాణానికి సర్వే



హెలిక్యాప్టర్ ద్వారా సర్వే

కొందుర్గు: రీజినల్ రింగ్ రోడ్డుకు సమాంతరంగా రింగ్ రైల్ నిర్మాణానికి శనివారం హెలికాప్టర్ ద్వారా సర్వే చేశారు. ఈ సందర్భంగా ఆర్వీ అసోసియేషన్ ఏజెన్సీ ప్రతినిధులు సర్వే పనులు మొదలుపెట్టారు. రెండు నెలల క్రితం మండలంలోని రేగడిచిల్కమర్రి, ముట్పూర్, ఉత్తరాసిపల్లి, బైరంపల్లి, మహదేవ్‌పూర్, కొందుర్గు, తంగెళ్లపల్లి మీదుగా రీజినల్ రింగ్‌రోడ్డు ఏర్పాటుకోసం మార్కింగ్ చేసిన చిహ్నాల ఆధారంగా సర్వే పనులు చేపట్టారు. హెలికాప్టర్ ద్వారా ఆయా గ్రామాల మీదుగా సర్వే నిర్వహించారు. కాగా రింగ్ రోడ్డు, రింగ్ రైల్ నిర్మాణం పనులు చేపడితే తమ పొలాలు ఎక్కడ పోతాయోనని ఆయా గ్రామాల రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ విషయమై అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు.

సృజనాత్మకత, ఆవిష్కరణలకు కేంద్రం హైదరాబాద్

రాయదుర్గం: డిజైన్, టెక్నాలజీ సృజనాత్మకత, సహకారవృద్ధిని ప్రోత్సహిస్తామని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. శనివారం హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీ హబ్‌లో 8 మ్యాట్రిక్స్ డిజైన్ కాన్‌క్లేవ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. ప్రతి రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సృజనాత్మకత, ఆవిష్కరణలకు కేంద్రంగా హైదరాబాద్ ఖ్యాతిని మరింత బలోపేతం చేయడమే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. ఈ నెల 20న ప్రపంచంలోనే అతిపెద్ద ఇన్నోవేషన్ ప్రాంగణమైన టీహబ్‌లో డిజైన్ పరిశ్రమలోని నాయకులు, ఆవిష్కర్తలకు ఒక ప్రధాన సమ్మేళనంగా సదస్సు నిర్వహించాలని తలపెట్టడం హర్షణీయమన్నారు. పరిశ్రమల వృద్ధికి కొత్త అవకాశాలను పెంపొందించడం ఈ సదస్సు ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో 8 మాట్రిక్స్ డిజైన్ కాన్‌క్లేవ్ అధికార ప్రతినిధి రాజ్ సావంకర్ పాల్గొన్నారు.

కత్తితో తండ్రి దాడి.. తనయుడి మృతి

నాగోలు: చదువు మధ్యలో మానేసి జులాయిగా తిరుగుతున్నావంటూ మందలించడంతో ఎదురు సమాధానం చెప్పిన కుమారుడిపై క్షణికావేశంలో తండ్రి కత్తితో దాడి చేశాడు. తీవ్ర గాయాల పాలైన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కర్మన్‌ఘాట్ న్యూమారుతీ నగర్‌కు చెందిన వీరనగరి శేఖర్ కుమారుడు జైపాల్(23) డిగ్రీ విద్యాభ్యాసాన్ని మధ్యలోనే ఆపేశాడు. డిగ్రీ పూర్తి చేయకుండా పనీ పాటా లేకుండా తిరుగుతున్నావంటూ శుక్రవారం రాత్రి కుమారుడిని తండ్రి శేఖర్ మందలించాడు. తండ్రికి జైపాల్ ఎదురు సమాధానం చెప్పడంతో కోపోద్రిక్తుడైన శేఖర్ ఇంట్లో ఉన్న కూరగాయలు కోసే కత్తితో కుమారుడి మెడపై పొడిచాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో జైపాల్ అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ రాత్రి 10.30 గంటలకు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

పల్లెల్లో తప్పని పాట్లు

కడ్తాల్: గ్రామాల్లో చాలామంది వ్యవసాయం, కూలి పనులపై ఆధారపడి జీవిస్తుండటంతో అధికారులు ఎప్పుడు సర్వే కోసం వస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. గ్రామంలో ఎటు వైపు నుంచి సర్వే నిర్వహిస్తున్నారో తెలియక, ఇంటి వద్దే ఉండాలా.. వ్యవసాయ పనులకు వెళ్లాలా అనే మీమాంసలో ఉండిపోయారు. ఈరోజు ఫలానా కాలనీలో ఎన్యుమరేటర్లు సర్వే చేపడతారని ముందస్తుగా సమాచారం లేకపోవడంతో అయోమయానికి గురయ్యారు. ఇక గ్రామాల్లో అధిక శాతం నిరక్షరాస్యులు కావడంతో ఎన్యుమరేటర్లు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడానికి ఇబ్బందులు పడుతూ కనిపించారు. 75 వరకు ప్రశ్నలు ఉండడంతో ఒక్కో ఇంటి వద్ద సమాచారం సేకరించడానికి గంటకుపైగా సమయం పట్టింది. ఎన్యుమరేటర్లు ఒక్కోరోజు 15 కుటుంబాలకు సంబంధించిన సమగ్ర సమాచారం సేకరించాల్సి ఉండగా మొదటిరోజు చాలా గ్రామాల్లో పదికి మించి జరగలేదు.

వివరాలు నమోదు చేయించుకున్న డీసీసీబీ చైర్మన్



వివరాలు నమోదు చేసుకుంటున్న కొత్తకుర్మ సత్తయ్య దంపతులు

తుర్కయంజాల్: సర్వేలో భాగంగా తుర్కయంజాల్‌లోని తమ ఇంటికి వచ్చిన ఎన్యుమరేటర్‌కు టిస్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య కుటుంబ వివరాలు తెలిపి నమోదు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మంచి ఉద్దేశంతో సర్వేను చేపడుతోందని, దీంతో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు దక్కుతాయని అన్నారు. సమగ్ర సర్వేలో ప్రజలంతా పాల్గొని తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.

జల్‌పల్లిలో సర్వే తీరును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్



అలా మొదలైంది

ఇంటింటి సమగ్ర సర్వే షురూ

- తొలి రోజు సిబ్బందికి చుక్కెదురు
- ఎక్కడికక్కడే నిలదీసిన జనం
- స్థిర, చరాస్తుల వివరాలు చెప్పేందుకు విముఖత
- తలపట్టుకుంటున్న ఎన్యుమరేటర్లు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి సర్వేకు మొదటి రోజు మిశ్రమ స్పందన లభించింది. సర్వేలో భాగంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ, కుల, విద్యా, ఉపాధి వంటి 75 ప్రశ్నలకు సంబంధించిన వివరాలను సేకరించేందుకు ఎన్యుమరేటర్లు యత్నిస్తుండగా.. సమగ్ర సమాచారం ఇచ్చేందుకు కొంతమంది నిరాకరించారు. ఇంటి యజమాని, కులం, వంటి సాధారణ వివరాలు ఇచ్చేందుకు పెద్దగా అభ్యంతరం చెప్పడం లేదు. కానీ ఇంటి యజమాని వార్షికాదాయం, ఆదాయపు పన్ను చెల్లింపు, ధరణి పాసుబుక్ నంబర్, స్థిర, చరాస్తులు, బ్యాంకు ఖాతా, ఇంటి విస్తీర్ణం, ప్రస్తుతం ఉన్న గదులు, ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి చేకూరిన లబ్ధి వంటి వివరాలు ఇచ్చేందుకు అంగీకరించడం లేదు. యజమానికి నచ్చజెప్పి ఆయా వివరాలను సేకరించేందుకు ఎన్యుమరేటర్లు ప్రయత్నించినా ఎదురు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దీంతో వారికి సరైన సమాధానం చెప్పలేక తలపట్టుకోవాల్సి వస్తోంది. కొంత మందైతే ఏకంగా ఇంటి గేటు కూడా తెరవడం లేదు. ఇంట్లో ఉండి కూడా ఎవరూ లేరని చెప్పి పంపుతుండడంతో ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. బాలాపూర్, జల్‌పల్లి, పహాడీషరీఫ్, రాజేంద్రనగర్, కాటేదాన్ సహా ఓఆర్ఆర్‌కు అటు ఇటుగా వెలసిన గేటెడ్ కమ్యూనిటీలు, విల్లాలు, బహుళ అంతస్తుల భవనాల్లో నివసించే వర్గాల నుంచి ఈ సమస్య ఎక్కువగా తలెత్తుతోంది.

ఇబ్బందిపడ్డ ఎన్యుమరేటర్లు

జిల్లా వ్యాప్తంగా 6.57 లక్షల కుటుంబాలు ఉన్నట్లు అంచనా వేశారు. ఈ మేరకు సర్వే కోసం 5,344 మంది ఎన్యుమరేటర్లను ఎంపిక చేసి శిక్షణ ఇచ్చారు. ఒక్కో ఎన్యుమరేటర్‌కు 150 నుంచి 175 కుటుంబాలను కేటాయించారు. మూడు రోజుల నుంచి సిబ్బంది ఆయా బ్లాకుల్లో పర్యటించారు. ఇంటింటికీ తిరిగి స్టిక్కర్లు అతికించారు. శనివారం నుంచి కుటుంబ సభ్యులు, ఇతర వివరాలు సేకరించే పని మొదలు పెట్టారు. ఎన్యుమరేటర్లకు తొలి రోజే చుక్కెదురైంది. ఇంటి ముందుకు వెళ్లిన సమయంలో ఆయా ఇంటి యజమానుల నుంచి వస్తున్న వ్యతిరేకతతో ఇబ్బంది పడ్డారు. సర్వేపై ప్రభుత్వ ఆదేశాలు స్పష్టంగా ఉండటంతో సంస్థాగతంగా ఎదురవుతున్న సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు వెనుకాడుతున్నారు. 75 ప్రశ్నలకు ఏదో కొన్ని పూరించి మమ అన్పిస్తున్నారు.

ఆ దరఖాస్తులకే దిక్కులేదంటూ..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాపాలన పేరుతో కొత్త రేషన్‌కార్డుల జారీ, ఉచిత కరెంట్, వంట గ్యాసు పథకాల అమలుకు ప్రజల నుంచి పెద్ద ఎత్తున వినతులు స్వీకరించింది. ఆధార్, రేషన్ కార్డు, కరెంట్ మీటర్ నంబర్, గ్యాస్ కనెక్షన్, బ్యాంకు ఖాతా నంబర్లను సేకరించింది. ఆయా దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. 200 యూనిట్లలోపు విద్యుత్ వాడే మూడు లక్షల మందికి ఉచిత కరెంట్ పథకం అమలవుతోంది. ఉచిత గ్యాసు పథకం మెజార్టీ లబ్ధిదారులకు ఇప్పటికీ అందడం లేదు. కొత్త రేషన్ కార్డులు జారీ కాలేదు. ఇప్పటికే ప్రభుత్వానికి కుటుంబ, వ్యక్తిగత వివరాలను అందజేసిన ప్రజలు తాజా సర్వేపై అంతగా ఆసక్తి చూపించడం లేదు. కేవలం ఇంటి యజమాని పేరు, కుటుంబ సభ్యుల వివరాలు, ఆధార్‌కార్డు నంబర్ మినహా ఇతర వివరాలు ఇచ్చేందుకు నిరాకరిస్తుండటంతో ఎన్యుమరేటర్లు కూడా ఏమీ చేయలేక చేతులెత్తేయాల్సి వస్తోంది.

గంటపాటు దగ్గరుండి.. ఫారం పూర్తి చేయించి

పహాడీషరీఫ్: సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ జల్‌పల్లి మున్సిపల్ పరిధిలో ఒకే ఇంటి వద్ద గంట పాటు నిలబడి మరీ సందేహాలను నివృత్తి చేస్తూ ఎన్యుమరేటర్‌తో ఫారంను పూర్తి చేయించారు. ఉదయం 11 గంటలకే మున్సిపాలిటీకి చేరుకున్న ఆమె 17వ వార్డులోని సూరెడ్డి నాగేందర్ రెడ్డి ఇంటి వద్దకు చేరుకొని సర్వే తీరును పరిశీలించారు. కుటుంబ సభ్యుల నుంచి ఎన్యుమరేటర్ వివరాలు సేకరించే క్రమంలో తడబడుతుండడాన్ని గమనించిన ఆమె దగ్గరుండి ప్రతి ప్రశ్నను అడగాల్సిన తీరు, పౌరులు ఇచ్చే సమాధానాన్ని అవసరమైన చోట కోడ్ రూపంలో ఎలా పూరించాలనే విషయాన్ని క్లుప్తంగా వివరించారు. ఇలా గంట పాటు అక్కడే నిలబడే అన్ని ప్రశ్నలకు జవాబులను ఫారంలో పొందుపరిచేలా చూశారు. ఈ విషయంలో ఎన్యుమరేటర్లకు సాయం చేస్తూ ప్రోత్సహించాలని జల్‌పల్లి కమిషనర్ బి.వెంకట్రామ్‌కు సూచించారు.

సర్వేలో సహాయ నిరాకరణ



ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని మంగళ్‌పల్లిలో..

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపల్ పరిధిలో ప్రారంభమైన సర్వేలో మొదటి రోజు జనం నుంచి సహాయ నిరాకరణ ఎదురైంది. ఎన్యుమరేటర్లకు సరైన సమాధానం చెప్పకుండా దాటవేస్తున్నారు. వార్షిక ఆదాయం ఎంత.. ఆదాయపు పన్ను చెల్లిస్తున్నారా.. ఆధార్ వివరాలు.. బ్యాంకు వివరాలు అడిగితే దాటవేశారు. భూముల వివరాలు అడిగితే నిరాకరించారు. కుల గణనకు ఇన్ని ప్రశ్నలు ఎందుకని ఎదురు ప్రశ్నించడం కనిపించింది. మరోవైపు సర్వే కోసం ఎన్యూమరేటర్లకు ఒక్కో ఇంటి వద్ద 30 నుంచి 40 నిమిషాల సమయం పట్టింది. మొదటి రోజు పది కుటుంబాలను మించి సర్వే చేయలేకపోయామని ఎన్యూమరేటర్లు తెలిపారు. చదువుకున్న వారు త్వరగా వివరాలు వెల్లడిస్తున్నారని, నిరక్షరాస్యులతో ఇబ్బందులు తప్పడం లేదని చెబుతున్నారు.

అరగంట నుంచి గంట



ఒక్కో ఇంటికి తిరిగి కులగణనకు సంబంధించిన ప్రశ్నలు అడిగి, సమాధానాలు రాసుకునేందుకు అరగంట నుంచి గంట సమయం పడుతోంది. అడిగిన ధ్రువపత్రాలు ఇంటి యజమానులు వెంటనే ఇవ్వకపోవడంతో కొంత జాప్యం జరుగుతోంది. కుటుంబసభ్యులందరి ఆధార్ కార్డులు అందుబాటులో ఉండడం లేదు. లేనివారివి ఆధార్ నంబర్ లేకుండానే పేర్లు నమోదు చేసుకున్నాం.

– సంధ్యారాణి, ఎన్యుమరేటర్, ఇబ్రహీంపట్నం

మొదటి రోజు ఎక్కువ సమయం

మొయినాబాద్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇంటింటి సర్వే మొదలైంది. శనివారం మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటి సర్వే చేపట్టారు. మొదటి రోజు చాలామంది ఎన్యూమరేటర్లు ఒకటి రెండు ఇళ్లు మాత్రమే సర్వే చేశారు. మండల పరిధిలోని చిలుకూరులో 'సాక్షి' సర్వే తీరును పరిశీలించింది. ఒక్కో ఇంటి వద్ద ఎన్యుమరేటర్‌కు గంటకు పైగా సమయం పడుతోంది. మొత్తం 75 ప్రశ్నలు అడిగి పూర్తి వివరాలు నమోదు చేసుకోవడానికి మొదటి రోజు ఎక్కువ సమయం తీసుకున్నారు. ఎన్యూమరేటర్ అడిగిన అన్ని ప్రశ్నలకు ప్రజలు సమాధానం ఇచ్చారు. వ్యక్తిగత వివరాలు అడిగినప్పుడు ఉంటే ఉన్నాయని.. లేకుంటే లేదని చెబుతున్నారు. ఇంటింటి సర్వేను మండల అభివృద్ధి అధికారి సంధ్య, ఏపీఎం రవీందర్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్ పర్యవేక్షించారు.



చిలుకూరులో ఓ కుటుంబం వివరాల నమోదు

అంకిత భావంతో పని చేయాలి

స్పెషల్ ఆఫీసర్ దివ్య దేవరాజన్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా ఎన్యుమరేటర్లు, సిబ్బంది అంకిత భావంతో పూర్తి చేయాలని సెర్ప్ సీఈఓ, ప్రజావాణి నోడల్ అధికారి, ఉమ్మడి జిల్లా స్పెషల్ ఆఫీసర్ దివ్య దేవరాజన్ అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో శనివారం సామాజిక, ఆర్థిక, ఉపాధి, రాజకీయ, కుల సర్వే ప్రక్రియపై కలెక్టర్ నారాయణ రెడ్డి, సంబంధిత అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సర్వే ప్రక్రియలో ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ, ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఎన్యుమరేటర్లు బాధ్యతగా వ్యవహరించాలని, ప్రజల్లో ఏవైనా సందేహాలుంటే తక్షణమే నివృత్తి చేయాలన్నారు. ఇచ్చిన ప్రొఫార్మాలో సమాచారాన్ని క్రోడీకరించాలన్నారు. ప్రజలు ఎలాంటి అపోహలు పడకుండా ఎన్యుమరేటర్లకు సమాచారం ఇచ్చి సహకరించాలని సూచించారు. సర్వేలో ఏ ఒక్క కుటుంబాన్ని విడిచి పెట్టొద్దని, అన్ని కుటుంబాల వివరాలు సమగ్రంగా సేకరించేలా ఎన్యుమరేటర్లకు సూచనలు, సలహాలు ఇవ్వాలని అధికారులకు సూచించారు. సర్వే నిర్వహించే ప్రాంతంలో ముందు రోజే ఆయా కుటుంబాలకు సమాచారం ఇవ్వాలన్నారు. కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ఇంటి యజమాని ఇచ్చిన వివరాలను మాత్రమే ప్రొఫార్మాలో పొందుపరచాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత, సీపీఓ సౌమ్య, పీడీ మెప్మా మల్లీశ్వరి, డీపీఓ సురేష్ మోహన్, జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర రావు, సివిల్ సప్లయ్ అధికారి శ్రీనివాస్, జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమావేశమైన దివ్యదేవరాజన్

సర్వేను విజయవంతం చేయాలి

తుక్కుగూడ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వేను విజయవంతం చేయాలని ఐఏఎస్ అధికారి దివ్య దేవరాజన్ కోరారు. తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రంలో సర్వే తీరును శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని, ఎదురయ్యే సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అన్నారు. సర్వేకు వచ్చే ఎన్యుమరేటర్లకు ప్రజలు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఓ సౌమ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ బరిగెల హేమలత, కమిషనర్ వాణి, మేనేజర్ పర్వతాలు, సీనియర్ అసిస్టెంట్లు వెంకటేశం, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్

హక్కుల సాధనకు ఉద్యమించాలి

మాలల ఆత్మీయ సమ్మేళనంలో చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్


ఇబ్రహీంపట్నం: హక్కుల సాధనకు మాలలు సంఘటితంగా ఉద్యమించాలని చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ పిలుపునిచ్చారు. మాలల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నియోజకవర్గ మాలల ఆత్మీయ సమ్మేళనాన్ని ఇబ్రహీంపట్నంలోని శాస్త్ర గార్డెన్‌లో శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వివేక్ మాట్లాడుతూ.. ఏబీసీడీ వర్గీకరణ రాజ్యాంగబద్ధంగా జరగలేదన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మాలలను ఎంతో బాధకు గురిచేసిందన్నారు. అన్ని రాష్ట్రాల అసెంబ్లీలు, పార్లమెంట్ ఆమోద తీర్మానాలతో ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి తప్ప ఏకపక్షంగా చేయడం సరైన పద్ధతికాదన్నారు. విభేదాలు పక్కన పెట్టి మాలలు హక్కుల సాధనకు సైనికుల్లా ఉద్యమించాలన్నారు. పోరాట పటిమతో ముందుకెళ్తేనే రాజకీయంగా చలనం కలుగుతుందన్నారు. మాలల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మాలల ఐక్య వేదిక నియోజకవర్గ కన్వీనర్ మారయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బుద్ధవనం ఓఎస్‌డీ మల్లేపల్లి లక్ష్మయ్య, ప్రముఖ కార్డియాలజిస్ట్ ఎంఎస్ గోపీనాథ్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ ఈడీ సర్వయ్య, సమతా సైనిక్ దళ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దిగంబర్ కాంబ్లి, ఉద్యమకారుడు రేంజర్ల షాన్ రాజేశ్, మాల మహానాడు నాయకుడు చెన్నయ్య, మందల భాస్కర్, టీఎంఐవీ అధ్యక్షుడు బాలకిషన్, కౌన్సిలర్ జగన్, ఐక్యవేదిక నేతలు పాల్గొన్నారు.

మంటలంటుకొని మహిళ మృతి

అబ్దుల్లాపూర్‌మెట్: బతుకుదెరువు కోసం చెత్త కుప్పల్లో ఉండే ప్లాస్టిక్ కవర్లు, ఇనుప సామగ్రి పోగు చేసుకొని కుటుంబాన్ని పోషించుకునే ఓ మహిళను విధి చిన్నచూపు చూసింది. చెత్త కుప్పల్లోని ఇనుప వస్తువులను ఏరుకునే క్రమంలో ప్రమాదవశాత్తు మంటలంటుకొని సజీవ దహనమైన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. హయత్‌నగర్ రంగనాయకుల గుట్ట ప్రాంతంలో నివసించే బుగ్గుల లలిత(45) చెత్త కుప్పల్లోని ఇనుప, ప్లాస్టిక్ వస్తువులు సేకరించి విక్రయిస్తూ వచ్చిన డబ్బుతో జీవనం సాగిస్తుండేది. ఈ క్రమంలో అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలోని బ్రిలియంట్ ఇంజనీరింగ్ కళాశాల వెనుక వైపు ఉన్న పంచాయతీ డంపింగ్ యార్డులో శనివారం పోగుచేసుకున్న వైరు తీగలను తగలబెట్టే క్రమంలో ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. ఆర్పేందుకు యత్నించే లోపే సజీవ దహనమైంది. పోలీసులు ప్రమాద ఘటనపై ఆరా తీశారు. కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిదండ్రులను చూడటానికి వెళ్లి వస్తూ..

- తనువు చాలించిన విద్యార్థి
- బలితీసుకున్న రోడ్డు ప్రమాదం
- మరొకరికి తీవ్ర గాయాలు



చరణ్ (ఫైల్)

యాచారం: తల్లిదండ్రులను చూడటానికి వెళ్లి వస్తున్న ఓ విద్యార్థిని రోడ్డు ప్రమాదం బలితీసుకుంది. యాచారం సీఐ నర్సింహారావు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన కె.యాదగిరి, యాదమ్మ దంపతులు. మాల్ మార్కెట్లో కూలీ పనులు చేసుకుంటూ అక్కడే ఉంటున్నారు. వారికి చరణ్ (15), తేజ, శివ ముగ్గురు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు చరణ్ స్వగ్రామంలో తాత రాములు, నాయినమ్మ నర్సమ్మ వద్ద ఉంటూ స్థానిక ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులను చూడడానికి శుక్రవారం సాయంత్రం మాల్‌కు వెళ్లాడు. శనివారం ఉదయం తిరిగి కొత్తపల్లి గ్రామానికి రావడానికి మాల్‌లోని నల్లవెల్లి చౌరస్తాలో వేచి ఉన్నాడు. చింతపట్ల గ్రామానికి చెందిన రవి బైక్‌పై వస్తుండగా లిఫ్ట్ అడిగి తక్కళ్లపల్లి గేట్‌కు బయలుదేరాడు. అదే క్రమంలో నగరం నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మాచర్ల వైపునకు వెళ్తున్న కారు వీరి బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కిందపడిపోయిన చరణ్‌పై నుంచి కారు వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. రవికి కూడా తీవ్ర గాయాలు కావడంతో నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. నిరుపేదలైన చరణ్ కుటుంబాన్ని ఆదుకోవాలని కొత్తపల్లి గ్రామస్తులు సాగర్‌రోడ్డుపై యాచారం పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించి ఆందోళనకు దిగారు. న్యాయం జరిగేలా చూస్తామని సీఐ నచ్చజెప్పడంతో వారు ఆందోళన విరమించారు. ప్రమాదానికి కారణమైన కారును పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



యాచారం ఠాణా ఎదుట ఆందోళన చేస్తున్న కొత్తపల్లి గ్రామస్తులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు


గాయపడిన యువకులు

కందుకూరు: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆమన్‌గల్లు మండలం మేడిగడ్డతండాకు చెందిన చింటు, జశ్వంత్‌లు శనివారం మధ్యాహ్నం బైక్‌పై కందుకూరు వైపు వస్తున్నారు. మార్గమధ్యలో శ్రీశైలం రహదారి దెబ్బడగూడ గేట్ సమీపంలో ఎదురుగా వస్తున్న కారు, వీరి బైక్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైక్‌పై నుంచి కింద పడిన వారిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం తీవ్రతకు కారులో ఉన్న రెండు బెలూన్లు తెరుచుకోవడంతో అందులో ప్రయాణిస్తున్న వారికి ఏలాంటి గాయాలు కాకుండా తప్పించుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వివాహిత అదృశ్యం

పూడూరు: కూలీకి వచ్చిన వివాహిత అదృశ్యమైన సంఘటన చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పుడుగుర్తి గ్రామానికి చెందిన చింతకుంట లక్ష్మమ్మ తన అక్క అయిన వికారాబాద్ మండలం అత్వెల్లి గ్రామానికి చెందిన కొంపల్లి జ్యోతి(35) మక్కలు విరిచేందుకు 15 రోజుల క్రితం కూలీకి వచ్చింది. ఈ నెల 3న అందరు తిని ఇంట్లో పడుకున్నారు. ఉదయం లేచి చూసే సరికే ఆమె కనిపించలేదని లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పత్తి కొనుగోలుకు సర్వం సిద్ధం

- షాద్‌నగర్‌లో 11 కేంద్రాలు
- కనీస మద్దతు ధర రూ.7,521
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

షాద్‌నగర్: రైతుల సౌకర్యార్థం పత్తి కొనుగోలు కేంద్రాలను అధికారులు జిల్లా వ్యాప్తంగా ఏర్పాట్లు చేశారు. అన్నదాతలు పండించిన పంటను కొనుగోలు చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. కొనుగోళ్లు మొదలుకొని రైతులకు డబ్బులు చెల్లింపు వరకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పక్కాగా అన్ని చర్యలు తీసుకున్నారు.

11 కేంద్రాల్లో కొనుగోళ్లు

షాద్‌నగర్ నియోజకవర్గంలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు చేస్తున్నారు. ఇందుకు గాను మొత్తం 11 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు.

- ఫరూఖ్‌నగర్ మండలం చిల్కమర్రిలో రాఘవేంద్ర కాటన్ కార్పొరేషన్, దోడియా ఆగ్రో ఇండస్ట్రీస్
- సోలీపూర్ శివారులోని గౌరవ్ ఇండస్ట్రీస్
- కేశంపేట మండలం వేములనర్వ గ్రామంలో గాయత్రి కాటన్ జిన్నింగ్ మిల్లు
- నందిగామలో తిరుమల ట్రేడింగ్ కంపెనీ, హరిహర జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ లిమిటెడ్, తుల్జా భవానీ కోటెక్స్
- అంతిరెడ్డిగూడలో వినాయక కాటన్ మిల్స్ ప్రైవేట్ లిమిటెడ్
- ఎలికట్ట శివారులోని శ్యాంకోటెక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్
- కొందుర్గు మండలం వనంపల్లిలో శ్రీనివాస కాటన్ ఇండస్ట్రీస్, సూపర్ కాటన్ జిన్నింగ్, ప్రెస్సింగ్‌లలో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.


షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్

తేమ ఆధారంగా ధర చెల్లింపు

పత్తి తేమ శాతం ఆధారంగా సీసీఐ వారు ధరను చెల్లించనున్నారు. ప్రభుత్వం క్వింటాలు పత్తికి కనీస మద్దతు ధరను రూ.7,521గా నిర్ణయించారు. పత్తిలో 8శాతం లోపు తేమ ఉంటే కనీస మద్దతు ధరను చెల్లిస్తారు. 9 శాతం తేమ ఉంటే మద్దతు ధర రూ.7,445.79 తగ్గుతుంది. 10శాతం తేమ ఉంటే రూ.7,350.58, తేమ 11శాతం ఉంటే రూ.7,295.37 పైసలు చెల్లిస్తారు.

పంట సాగు ఇలా

షాద్‌నగర్ డివిజన్‌లో రైతులు పెద్ద ఎత్తున పత్తి పంటను సాగు చేశారు. ఫరూఖ్‌నగర్‌లో 717 హెక్టార్లు, జిల్లేడు చౌదరిగూడలో 2345 హెక్టార్లు, కేశంపేటలో 3922 హెక్టార్లు, కొందుర్గులో 5314 హెక్టార్లలో పత్తి పంటను సాగుచేసినట్లు అధికారులు తెలిపారు.

ఇవి తప్పనిసరి

పత్తి విక్రయించేందుకు రైతులు కొనుగోలు కేంద్రాలకు పత్తిని తీసుకెళ్లేటప్పుడు విధిగా ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్, బ్యాంకు ఖాతా పుస్తకం, ఫోన్ నంబర్‌ను వెంట తీసుకొని రావాలని అధికారులు తెలిపారు. ఆధార్‌కు అనుసంధానమైన బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ చేస్తారు.

నాణ్యమైన పత్తికి మంచి ధర



తేమ శాతం తక్కువగా ఉంటే రైతులకు మంచి మద్దతు ధర పొందవచ్చు. ప్రభుత్వం క్వింటాలుకు రూ.7,521 మద్దతు ధర చెల్లిస్తుంది. తేమ 12శాతం కంటే ఎక్కువగా ఉంటే సీసీఐ వారు పత్తి కొనుగోలు చేయరు.

– శ్రీనివాస్, ప్రత్యేక శ్రేణి కార్యదర్శి, ఏఎంసీ, షాద్‌నగర్

గర్భకోశ చికిత్స తప్పనిసరి

పశువైద్యుడు అశోక్‌రెడ్డి


అన్నాసాగర్‌లో ఉచిత పశువైద్య శిబిరం

బంట్వారం: పశువులకు గర్భకోశ చికిత్స తప్పనిసరిగా చేయించాలని పశువైద్యులు సూచించారు. శనివారం కోట్‌పల్లి మండల పరిధిలోని అన్నాసాగర్ గ్రామంలో పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధులకు చికిత్స చేశారు. పశువుల వైద్యుడు అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. దీర్ఘకాలంగా ఎదకు రాని పశువులను గుర్తించి తగిన చికిత్స చేశారన్నారు. పశువులకు పలు సమస్యలను గుర్తించి అవసరమైన మందులు ఇచ్చామన్నారు. 34 గేదెలకు చూడి నిర్ధారణ పరీక్షలు, 58 ఆవులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స చేసినట్లు చెప్పారు. అలాగే 62 లేగదూడలకు నట్టల నివారణ మందులు తాగించినట్లు వివరించారు. కార్యక్రమంలో జూనియర్ వెటర్నరీ అధికారి నర్సింలు, గోపాల మిత్రలు బందయ్య, నరేందర్, శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్లపై కేసు

పెద్దేముల్: పోలీసులకు వచ్చిన నమ్మదగిన సమాచారంతో శనివారం పేకాట స్థావరాలపై దాడులు జరిపారు. మండలంలోని నాగులపల్లి గ్రామశివారులో పేకాట ఆడుతున్న వారిపై దాడి చేశారు. ఈ ఘటనలో ఏడుగురిపై కేసు నమోదు చేశారు. వారినుంచి రూ.ఎనిమిది వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

హామీలను మరిచిన సీఎం

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య


మాట్లాడుతున్న జంగయ్య

షాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో సీపీఐ మండల కార్యదర్శి నక్కలి జంగయ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందే రుణమాఫీని ఎలాంటి షరతులు లేకుండా అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మాట తప్పిందన్నారు. నిరుపేదలకు ఇందిరమ్మ, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని, స్థలం ఉన్న వారికి ఇంటి నిర్మాణం కోసం రూ.ఐదు లక్షల తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్‌మెంట్ నిధులను తక్షణమే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు రామస్వామి, వ్యకాసం జిల్లా అధ్యక్షుడు అంజయ్య, నాయకులు రఘురాం, నారాయణ, మధు, రుక్కయ్య, శ్రీశైలం, నర్సయ్య, రాములు, నర్సింహులు, పాండు, రాములు, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక విద్యను మెరుగుపర్చుకోవాలి


సైంటిస్ట్ విజయ్‌కుమార్ అగర్వాల్‌ను సన్మానిస్తున్న కళాశాల బృందం

డీఆర్‌డీఎల్ సైంటిస్ట్
డాక్టర్ విజయ్‌కుమార్ అగర్వాల్

మొయినాబాద్‌రూరల్: సాంకేతిక విద్యను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని డీఆర్‌డీఎల్ హైదరాబాద్ సైంటిస్ట్ డాక్టర్ విజయ్‌కుమార్ అగర్వాల్ అన్నారు. శనివారం మండల పరిధిలోని జేబీఐఈటీ విద్యా సంస్థల్లో నిర్వహించిన ఇంటర్ డిసిప్లేనరీ రిసర్చ్ ఇండస్ట్రీ అకాడమి పేరుతో సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సైంటిస్ట్ డాక్టర్ విజయ్‌కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ.. సైంటిస్ట్‌కి సాంకేతికతను డిసిప్లేనరీ పని విధానాన్ని వివరిస్తుందని సూచించారు. పరిశోధన, ఆవిష్కరణ ప్రయత్నాలను కొనసాగించినప్పుడే అభివృద్ధి చెందుతారని సూచించారు. కమ్యూనికేషన్‌లో ఆవిష్కరణను రూపొందించడానికి లక్ష్యంగా పెట్టుకున్నట్లు సూచించారు. కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్త అడ్మినిస్ట్రేట్ ఐఐటీ ఢిల్లీ మాజీ డైరెక్టర్, బీఐటీఎస్ గ్రూప్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వి.రాంగోపాల్‌రావు మాట్లాడుతూ.. పరిశోధన, ఆవిష్కరణలు ఇంటర్ డిసిప్లేనరీ రిసర్చ్ ఇండస్ట్రీ సహాయ సహకారాలతో పాటు స్టార్టప్‌లకు ప్రభుత్వ సహకారం ఎంతో అవసరం ఉంటుందని సూచించారు. సమావేశంలో జేబీఐఈటీ కార్యదర్శి జె.వి.కృష్ణారావు, ప్రిన్సిపాల్ కృష్ణమాచారి, డాక్టర్ షెహెన్షా, కాన్ఫరెన్స్ చైర్ పర్సన్ డాక్టర్ సుల్తానా, కన్వీనర్ అనింద్యజానా, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కర్ణాటకలో రోడ్డు ప్రమాదం

సహాయక చర్యల్లో కరన్‌కోట్ పోలీసులు


ప్రమాదానికి గురైన కారును పరిశీలిస్తున్న ఎస్ఐ విఠల్‌రెడ్డి

తాండూరు రూరల్: కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా సమీపంలోని కమలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తికి చెందిన నాలుగురు మృతి చెందారు. డీజీపీ జితేందర్‌రెడ్డి, వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు తాండూరు మండలం కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి తన బృందంతో కర్ణాటకలోని రోడ్డు ప్రమాద సంఘటనా స్థలానికి వెళ్లారు. మృతదేహాలను అక్కడే ఉన్న స్థానిక ఆస్పత్రికి తరలించారు. మృతుల కుటుంబ సభ్యులకు సమాచారం అందజేసి సహాయక చర్యల్లో పాల్గొన్నారు. అయితే గుల్బర్గాకు వికారాబాద్ జిల్లా తాండూరు ప్రాంతానికి దగ్గరగా ఉండటంతో సరిహద్దులోని కరన్‌కోట్ పోలీసులకు ఉన్నతాధికారులు సహాయక చర్యల్లో పాల్గొనాలని ఆదేశాలు జారీ చేశారని ఎస్ఐ తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఆర్డీఓ సరిత


ఆస్పత్రికి వీల్‌చైర్లను అందజేస్తున్న ఆర్డీఓ సరిత

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వ ఆస్పత్రిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆర్డీఓ సరిత అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని శుక్రవారం కలెక్టర్ నారాయణరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలపై కలెక్టర్ అధికారులను నిలదీశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం ఆర్డీఓ సరిత ప్రభుత్వ ఆస్పత్రికి 10వీల్‌చైర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. ఆస్పత్రికి వచ్చే రోగుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వీల్‌చైర్లను ఇచ్చామన్నారు. రోగులకు సరిపడా వీల్‌చైర్లు లేకపోవడంతో నడవలేని వారిని, వృద్ధులను తీసుకువెళ్లేందుకు కష్టాలను ఎదుర్కొంటున్నారన్నారు. రోగులకు కావాల్సిన వసతులను కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోజులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని వైద్యులకు సూచించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించి సకాలంలో విధులకు హాజరు కావాలని సూచించారు. రోగులపట్ల మర్యాదగా ఉంటూ ప్రభుత్వ వైద్యంపై రోగులకు భరోసాను కల్పించాలని సూచించారు. ఉన్నతాధికారుల సహకారంతో ఆస్పత్రికి కావాల్సిన వసతులను కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, రాకేశ్, శ్రీశైలం, అన్వర్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.